క్లుప్తంగా

సమ్మెను జయప్రదం చేయండి



డాక్టర్ దార్ల సందీప్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న ఆశావర్కర్ల సంఘం

హనుమంతునిపాడు: సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఆశావర్కర్ల సంఘ నేతలు వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు బడుగు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మెడికల్ అధికారి దార్ల సందీప్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు కత్తి రూతమ్మ, బాలచెన్నమ్మ, రాణి, ఆశావర్కర్ల నేతలు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

సీఎస్‌పురం(పామూరు): ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జేఎస్.ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి షేక్. నాయబ్‌రసూల్ కోరారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులు ఉండేలా విధంగా మోడల్ ప్రాథమిక పాఠశాలలు లేదా బేసిక్ ప్రైమరీ స్కూల్స్ మాత్రమే ఉండాలని, అన్ని ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగించాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను కొనసాగించాలని కోరారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



మోరవారిపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హనుమంతునిపాడు: స్థానిక పంచాయతీ పరిధిలోని మోరవారిపల్లిలో గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అర్చకులు స్వామిని పట్టువస్త్రాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకుల వేద మంత్రాల నడుమ స్వామికి ఆవుల జయలరామిరెడ్డి, రత్తమ్మ దంపతులు కల్యాణం జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఆలయంలో వసతుల పరిశీలన



మాట్లాడుతున్న సీఐ నాయబ్‌రసూల్

హనుమంతునిపాడు: ఈ నెల 10న ప్రారంభం కానున్న లక్ష్మీ చెన్నకేశవస్వామి తిరునాళ్లను పురస్కరించుకొని సీఐ, నాయబ్ రసూల్, ఎస్సై మాధవరావు వసతులు పరిశీలించారు. ఈ సందర్భంగా చెన్నకేశవ స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిజరాజు నరసింహబాబు, ఆలయ కమిటీ ధర్మకర్త సానికొమ్ము రాఘవరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడారు. తిరునాళ్లకు వచ్చే భక్తులటు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

పొన్నలూరు: మండలంలోని రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించనున్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాన్ని పొందేందుకు తమ వివరాలను స్థానిక రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని ఏవో పూర్ణచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పథకం పొందాలంటే ఆధార్ కార్డ్, వన్ బీ, బ్యాంక్ అకౌంట్ పుస్తకం, పొలం పాస్ పుస్తకం జిరాక్సులు రైతు సేవా కేంద్రంలో సమర్పించాలన్నారు. రైతులు తమ వివరాలు నమోదు చేసుకోకపోతే పథకం వర్తించదని ఆయన హెచ్చరించారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

ఉలవపాడు: ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో విద్యార్థులు ఉచితంగా చేరడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని.. దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ రమణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సచివాలయం 3 కి.మీ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో చేరడానికి అవకాశం ఉందన్నారు. సెంట్రల్ సిలబస్‌లో చేరడానికి 2 ఏప్రిల్ 2019 నుంచి 31 మార్చి 2020 లోపు పుట్టిన వారు అర్హులన్నారు. స్టేట్ సిలబస్‌లో చేరడానికి 2 జూన్ 2019 నుంచి 31 మే 2020లోపు పుట్టిన వారు అర్హులని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకుని ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్ పూర్తి చేయాలన్నారు. ఆఫ్‌లైన్ కోసం విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేయించుకోవచ్చని తెలిపారు.

ఆధార్ కోసం.. అపార కష్టాలు !

- ఆధార్ సవరణల అందుబాటులో ఒకే ఒక కేంద్రం
- రోజుకు 30 మందికి మాత్రమే అవకాశం ఇస్తున్న వైనం
- వందల మంది కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు
- సాంకేతిక కారణాలతో తిప్పి పంపుతున్న ఆధార్ కేంద్రం సిబ్బంది



ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రం

కందుకూరు:

కూటమి ప్రభుత్వం ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రజలకు ఆధార్ కష్టాలు తప్పడం లేదు. ఆధార్ కార్డులో తప్పుల సవరణలు, నూతన కార్డుల నమోదు వంటి వాటి నమోదు కోసం ప్రజలు రోజుల తరబడి ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రధానంగా కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో వేల మంది జనాభాకు ఒకే ఒక కేంద్రం అందుబాటులో ఉండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా సరే ప్రభుత్వ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఆధార్ నమోదు, సవరణల అనేది ఓ ప్రహసనంగా మారింది.

ఒకే ఒకటి.. ఇబ్బందులు అనేకం..

కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో ఆధార్ నమోదు, ఆధార్ తప్పుల సవరణలు, వయస్సు మార్పు, అడ్రస్ మార్పు వంటివి చేసుకునేందుకు మున్సిపాలిటీ పరిధి మొత్తానికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఒకే ఒక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలోనే ఆధార్‌కు సంబంధించిన సేవలు అందిస్తున్నారు. దీంతో మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలంతా ఆధార్ సేవల కోసం ఈ కేంద్రానికే వస్తున్నారు. ప్రతి రోజు 100 మందికి పైగా ఆధార్ సేవల కోసం ఇక్కడికి వస్తున్నారు. అయితే ఈ కేంద్రంలో ప్రస్తుతం రోజుకు 30 మందికి మాత్రమే టోకెన్‌లు ఇచ్చి వారికి మాత్రమే సేవలు అందిస్తున్నారు. మిగిలిన వారు తిరిగి ఇంటికి వెళ్లాల్సిందే. ఈ విధంగా ప్రతి రోజు వందల మంది ఆధార్ కేంద్రానికి వచ్చి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. దాదాపు 70 వేల మంది నివాసం ఉండే మున్సిపాలిటీ పరిధిలో కేవలం ఒకే ఒక ఆధార్ కేంద్రం ఏర్పాటు వల్ల ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా సరే అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదు.

ఇబ్బందులు పడుతున్నా జనం..

ప్రధానంగా చిన్న పిల్లలకు నూతన ఆధార్‌కార్డుల నమోదు, ఆధార్ వయస్సు, అడ్రస్, పేర్లు వంటి తప్పులు సరిచేసుకునేందుకు పెద్ద సంఖ్యలో ఆధార్ కేంద్రానికి వస్తున్నారు. ఇటువంటి అన్ని సేవలను కేవలం ఈ కేంద్రంలో మాత్రమే అందిస్తున్నారు. ఇటీవల కాలంలో విద్యార్థులకు ఆపార్ కార్డు మంజూరు కోసం పెద్ద సంఖ్యలో ఆధార్ సవరణల కోసం వస్తున్నారు. అయితే సమయంలో ఇటీవల ప్రభుత్వం నూతన రేషన్ కార్డు మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటన చేసింది. అయితే రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలంటే ఆధార్‌లో అడ్రస్ కచ్చితంగా ఉండడంతో పాటు, పేర్లు తప్పులు లేకుండా ఉండాలి. ఈ నేపథ్యంలో ఆధార్‌కార్డులో అడ్రస్ మార్పు కోసం పెద్ద సంఖ్యలో గత రెండు రోజుల నుంచి ఆధార్ కేంద్రానికి వస్తున్నారు.

పనిచేయని సర్వర్..

అయితే ఆధార్ కేంద్రం సిబ్బంది మాత్రం ప్రస్తుతం అడ్రస్ మార్పు లాగిన్ రావడం లేదని, ఆపేశారని, తిరిగి లాగిన్ రావడానికి మరో 20 రోజుల వరకు సమయం పడుతుందని సమాధానం చెప్తున్నారు. ఈలోపు ప్రభుత్వం రేషన్‌కార్డు దరఖాస్తు చేసుకునేందుకు ఇచ్చిన గడువు ముగిసి పోతుంది. ఇటువంటి పరిస్థితుల్లో ఏం చేయాలో అర్థం కాక లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకునే సమయంలో లాగిన్ లేదని చెప్పడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. గతంలో తెలంగాణ ప్రాంతం నుంచి ఇక్కడి వచ్చిన వారు, గ్రామాల నుంచి పట్టణానికి వచ్చి స్థిరపడిన వారు ప్రస్తుతం రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే కుదరడం లేదు. రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలంటే ప్రస్తుతం నివాసం ఉండే ప్రాంత అడ్రస్ తప్పనిసరి కావడంతో మార్చుకునేందుకు అనేక మంది ఆధార్ కేంద్రానికి వస్తున్నా ప్రస్తుతం ఆ సేవలు అందుబాటులో లేవని కేంద్రం సిబ్బంది చెప్తుండడం గమనార్హం. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో పడుతున్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులేవి..

ఆధార్ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించే పరిష్కరించేవారు. అయితే ప్రస్తుతం అటువంటి క్యాంపులు ఏమీ ప్రభుత్వం నిర్వహించడం లేదు. గతంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్న పిల్లల అందరికి ఆధార్‌కార్డు నమోదు చేసేవారు. అలాగే సచివాలయాల పరిధిలో కూడా ఆధార్ సేవలు అందించేవారు. పట్టణంలో నాలుగైదు ప్రాంతాల్లోని సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉండేవి కాని ప్రస్తుతం సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో లేవని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గతంలో బ్యాంకుల్లో కూడా ఆధార్ సేవలు అందించే వారని ప్రస్తుతం బ్యాంకుల్లో కూడా అందుబాటులో లేవు. కేవలం యూనియన్ బ్యాంకులో మాత్రమే పరిమిత ఆధార్ సేవలను మాత్రమే అందిస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రానికి వందలాది మంది ప్రజలు ప్రతిరోజు క్యూ కడుతున్నారు. అయితే ఈ కేంద్రంలో ప్రజల రద్దీకి తగ్గట్టుగా మౌలిక వసతులు, సిబ్బంది అందుబాటులో లేరు. దీంతో కేవలం రోజుకు 30 మందికి మాత్రమే ఆధార్ సేవలు అందించి మిగిలిన వారిని తిప్పి పంపుతున్నారు. దీంతో రోజుల తరబడి ఆధార్ సేవల కోసం ప్రజలు కేంద్రం చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఆధార్ సేవా కేంద్రాలు పెంచాలని వేడుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వంలో అరాచక పాలన



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్

- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ



బ్రహ్మంగారి ఆలయంలో పూజలు చేస్తున్న దద్దాల నారాయణ యాదవ్

పీసీపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తుందని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ అన్నారు. మండలంలోని పడమటిపల్లిలో వెలసిన మద్విరాజ్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దద్దాల నారాయణ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు దాటినా ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. స్కీంల పేరుతో భారీ స్కాంలు చేస్తూ ప్రజల సొమ్మును నేతలు దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు దేనికి భయపడాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, ఒకే రెడ్డి, యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి, మూలే రాజశేఖర్ రెడ్డి, నడికట్టు వెంకటేశ్వర్లురెడ్డి, వెంకట్ రెడ్డి, విరపనేని చెన్నారావు చౌదరి, శ్రీకాంత్, పరిమి వెంకట్రావు, సబ్బారావు, భవనం నరసారెడ్డి, భవనం, రమణారెడ్డి, నడికట్టు రమణారెడ్డి, నరేష్ ఆచారి, పోలిశెట్టి రాజా, సైకం సుబ్బారెడ్డి, కొండ్రు నరసింహ, శీలం సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

239 పొగాకు బేళ్లు తిరస్కరణ



వేలానికి హాజరైన వ్యాపారులు



వేలంలో వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో 239 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఇన్‌చార్జి వేలం నిర్వహణాధికారి శివకుమార్ ది గ్రేట్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని ధర్మవరం, కోయవారిపాలెం, ముక్కోడిపాలెం, తాటాకులపాలెం, వెంకటకష్టాపురం గ్రామాలకు చెందిన రైతులు 1220 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 981 బేళ్లు కొనుగోలయ్యాయి. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.210, సరాసరి ధర కేజీ రూ.254.06గా నమోదైంది. వేలంలో 15 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.205

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో గురువారం జరిగిన వేలంలో పొగాకు గరిష్ట ధర రూ.205కు వ్యాపారులు కొనుగోలు చేశారు. రోజురోజుకూ లోగ్రేడు పొగాకు ధరలు తగ్గుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొగాకు బోర్డు అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టంగుటూరు, జరుగుమల్లి, సాదువారిపాలెం, వావిలేటిపాడు గ్రామాలకు చెందిన రైతులు 648 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 550 బేళ్లు కొనుగోలు జరిగాయి. 98 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280 పలకగా, కనిష్ట ధర రూ.205 పలికింది. సరాసరి రూ.242.41 ధర పలికింది. వేలంలో మొత్తం 23 మంది వ్యాపారులు పాల్గొన్నారని ఇన్‌చార్జి వేలం నిర్వహణాధికారి సత్య శ్రీనివాస్ తెలిపారు.

పత్రికా రంగంపై దాడి హేయమైన చర్య



డీఎస్పీకి వినతి పత్రం అందచేస్తున్న జర్నలిస్టులు

- కనిగిరిలో జర్నలిస్టుల నిరసన
- ఆర్డీఓకు, డీఎస్పీలకు వినతి

కనిగిరిరూరల్: అవినీతి అక్రమాలు వెలికితీయడంతో పాటు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రక్రియలో కీలకంగా వ్యవహరించే పత్రికా రంగంపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు అన్నారు. సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి నివాసంలోకి గురువారం విజయవాడ పోలీసులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా ప్రవేశించి దురుసుగా ప్రవర్తించడాన్ని పాత్రికేయులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు నిరసన తెలియజేశారు. అనంతరం ఆర్డీఓ బి.కేశవర్ధన్‌రెడ్డి, డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను భంగం కల్గించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను ప్రశ్నించకూడదనే నిరంకుశ వైఖరితో కుట్రపూరిత వైఖరితో దాడి చేయడాన్ని తీవ్రంగా ఎండగట్టారు. కేవలం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో నాల్గో స్తంభమైన మీడియా పరిరక్షణకు, పత్రికా స్వేచ్ఛకు రక్షణ కల్పించాలని. ప్రతిక రంగంపై దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సయ్యద్ ఖాలక్ దావర్, కొండ్రు ప్రసాద్‌రావు, మీసాల రమేష్, ప్రెస్‌క్లబ్, వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు, సయ్యద్ షఫీ, ఎస్‌కే మీరా, ఎస్‌కే షరీఫ్, ఆచారి, ఎస్ఆర్ ఖాదర్ బాషా, నరాల రామిరెడ్డి, ఎస్‌కే నజీర్ బాషా, రాచపుడి స్వర్ణబాబు, తాతపుడి శ్యాం, తోకల తిరుపతిరావు, ఎం పూర్ణ చంద్రరావు, రాంబాబు, కోటికల బాదుల్లా పాల్గొన్నారు.

ప్రతికా స్వేచ్ఛపై దాడి సరైంది కాదు:



ప్రతికా స్వేచ్ఛపై దాడి సరైంది కాదు. సమాజంలో జరిగే అవినీతి, అక్రమాలను వెలికితీసే పత్రికా రంగంపై జర్నలిస్టులను బెదిరించే ధోరణిలో వ్యవహరించడం మానుకోవాలి. రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే దాడులు, అక్రమ కేసులు బనాయించడం సరైన పద్ధతి కాదు. ప్రజాస్వామ్యంలో వారధులుగా ఉన్న ప్రతికా ప్రతినిధులపై బెదిరింపు ధోరణి విడనాడాలి.

జీవీ రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

సోలార్ పార్కుల ఏర్పాటుకు భూముల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న డీటీ, సర్వేయర్

పామూరు: మండలంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఉన్న ప్రాంతాల్లో పీఎం కుసుమ పథకం కింద సోలార్ పార్కులు ఏర్పాటు చేసేందుకు భూములు ఎంపిక చేసి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్..తహసీల్దార్ కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు. దీనిపై గురువారం డిప్యూటీ తహసీల్దార్ పొన్నరుసు వెంకటేశ్వర్లు మండలంలోని పెదగోగులపల్లి, డీజీపేట, కోవిలంపాడు గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల సమీపంలో ఉన్న భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డీజీపేటలో సర్వేనంబర్ 199/1లో 6.75 ఎకరాలు, కోవిలంపాడులో సర్వేనంబర్ 48 లో 4.50 ఎకరాలు, పెదగోగులపల్లెలో 219 సర్వేనంబర్‌లో 13.50 ఎకరాలు ప్రభుత్వ భూములను గుర్తించి సోలార్ పార్కుల ఏర్పాటుకు నివేదికలు తయారుచేసి కలెక్టర్‌కు పంపుతున్నట్లు తెలిపారు. వీఆర్‌ఓ ఖాజారఫి, సర్వేయర్ జీవిత పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగింపు



కొండపి-కామేపల్లి రోడ్డులో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కొండపి: మండల కేంద్రం కొండపి-కామేపల్లి రోడ్డుపై కుప్పగా పోసిన వ్యర్థాల నుంచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని గత శనివారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కేవలం ప్రకటనలకే పరిమితమవుతోందని స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. సాక్షి కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు కుప్పగా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఆ ప్రాంతాలలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకూడదని అధికారులుప్రజలకుసూచించారు

శంకర్‌రెడ్డిని పరామర్శించిన దద్దాల



శంకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న చాకిరాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గంజి శంకర్‌రెడ్డిని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ గురువారం పరామర్శించారు. ప్రమాద ఘటన వివరాలను అడిగి తెలుసుకుని, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, సూరసాని మోహన్‌రెడ్డి, కటికల వెంకట రత్నం, సైకం స్వర్ణ ఏడుకొండలురెడ్డి, శ్రీహరి, గంజి వెంకటేశ్వరరెడ్డి, రామన భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15న మండల సర్వసభ్య సమావేశం

కందుకూరు రూరల్: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 15వ తేదీ ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పీ రత్నజ్యోతి తెలిపారు. ఎంపీపీ ఇంటూరి సుశీల అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, అన్ని శాఖాల మండల స్థాయి అధికారులు తమ పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

వైభవంగా రథోత్సవం



వీరబ్రహ్మేంద్ర స్వామి రథోత్సవం

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి రథోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారికి కళ్యాణ మహోత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. కళ్యాణ ఆరాధన కార్యక్రమం అనంతరం రథోత్సవం గ్రామ వీధుల్లో నిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు, చిన్న పిల్లలు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి అమానుషం

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్



ఆర్.మోహన్

సింగరాయకొండ: కూటమి ప్రభుత్వంలో సామాన్య ప్రజలపై దాడులు పెరిగాయని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, చివరికి పత్రికా స్వేచ్ఛను హరించడం అమానుషమని, ఇందుకు నిదర్శనమే సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి ఇంటిపై పోలీసుల దాడులని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. మోహన్ దుయ్యబట్టారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆరాచకాలను ప్రజల ముందుంచుతూ ప్రభుత్వ అవినీతిని ఎప్పటికప్పుడు సాక్షి తన కథనాల ద్వారా బట్టబయలు చేస్తోందని కొనియాడారు. ఇది ఓర్వలేని కూటమి ప్రభుత్వ పెద్దలు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక పత్రిక ఎడిటర్ ఇంట్లోకి పోలీసులు ప్రవేశించి తలుపులు మూసి సోదాలు చేయడం పత్రికా స్వేచ్ఛను అడ్డుకునే ప్రయత్నమని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వ పెద్దలు పోలీసులు తమ చేతిలో ఉన్నారు కదా అని అక్రమ కేసులు బనాయించటం, భయపెట్టడం వంటి పిల్ల చేష్టలు మానుకోవాలని, ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని హితవు పలికారు. ఇదే విధంగా తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే రాబోయే రోజుల్లో ప్రజలే కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేస్తారని మోహన్ హెచ్చరించారు.